గూడేల గోడు పట్టదా!

చెంచు గూడేల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏ కూడా గిరిజనులను అక్కున చేర్చుకోలేక పోతోంది. నిధులు మంజూరవుతున్నా నేటికీ గిరిజనులకు కూడూ గూడు కల్పించలేకపోతోంది. కొందరికైతే రేషన్ కార్డు కూడా లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. వీరి గోడు అటు ప్రజాప్రతినిధులకు కానీ.. ఇటు అధికారులకు పట్టడం లేదు.

– కొత్తపల్లి

- చెంచులకు అందని ప్రభుత్వం పథకాలు
- పట్టించుకోని ఐటీడీఏ
- జనావాసాలకు దూరంగా గిరిజనులు



పొలంలో పట్టలతో గిరిజన కుటుంబం వేసుకున్న గుడిసె

కొత్తపల్లి మండలంలో 12 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 9 చెంచు గిరిజన గూడేల్లో సుమారు 502 కుటుంబాల్లో 3,000 మంది చెంచు గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. నల్లమల అడవుల్లో జీవనం సాగించే గిరిజనులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేకంగా ఐటీడీఏను ఏర్పాటు చేసి పర్యవేక్షణ కోసం అధికారులను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాకపోతే ఐటీడీఏ అధికారులు చెంచు గిరిజనుల వైపు కన్నెత్తి చూడకపోవడంతో నేటికీ గిరిజనుల జీవన పరిస్థితి ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైందన్న విమర్శలున్నాయి. చెంచు గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తున్నప్పటికీ అవి ఎక్కడ ఖర్చు చేస్తున్నారో అయోమయ పరిస్థితి నెలకొంది.

- ఎర్రమఠం చెంచుగూడేనికి చెందిన దాసరి బుడ్డమ్మకు ఏడుగురు సంతానం. ముగ్గురు కుమారులు అనారోగ్య కారణాలతో మృతిచెందారు.



పంటపొలంలో జీవిస్తున్న గిరిజన కుటుంబం

మిగతా నలుగురు కుమారులు ఉన్నారు. వీరికి ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందక కూలి పనులే జీవనాధారంగా బతుకుతున్నారు. ఇల్లు లేకపోవడతో ఆమె కుటుంబం ఏడాది నుంచి పొలంలోనే టార్పాలిన్ పట్టాలు వేసుకొని జీవనం సాగిస్తోంది. ఇలాంటి వారు మండలంలో ఇంతోమంది గిరిజనులు ఉన్నా వారి వద్దకు వెళ్లిన అధికారులు లేరు. రేషన్ కార్డు, ఆధారు కార్డులు లేక వారు జనావాసాలకు దూరంగా బతుకీడుస్తున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి గిరిజనుల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఇల్లు లేదు..పొలం లేదు



మాకు గూడెంలో ఇల్లు లేదు. పొలంలేదు, రేషన్ కార్డు లేదు. కూలీపనికి పోతేనే కడుపు నిండేది. పొలంపనులు చేసుకుంటూ రైతుల పొలాల్లోనే ఉంటాం. వారు ఇచ్చిన అరకొర కూలీతోనే కడుపు నింపుకుంటాం. మాపిల్లలకు సరైన బట్టలు కూడా లేవు. వానకు నానుతూ, ఎండకు ఎండుతూ బతుకుతున్నాం. మమ్మల్ని పట్టించుకునేటోళ్లు లేరు.

– దాసరి నారమ్మ, ఎర్రమఠం చెంచుగూడెం

రేషన్ కార్డు లేదు



మాకు బియ్యం కార్డు లేదు. అందుకే బియ్యం రావడం లేదు. ప్రతిరోజు కూలి పనికి వెలితేనే నాలుగేళ్లు నోట్లోకి పోతాయి. నాకు ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మా కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు అందడంలేదు. అధికారులు మాపై దయ ఉంచి ఆధార్ కార్డు, రేషన్ కార్డు ఇచ్చి ఇల్లు కట్టించి ఇవ్వాలి.

– దాసరి వెంకటేశ్వర్లు

క్లుప్తంగా

నిర్మాణాలు పూర్తయిన వెంటనే బిల్లులు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రాజు

పాములపాడు: లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్న వెంటనే బిల్లులు చెల్లించనున్నట్లు మండల ప్రత్యేకాధికారి రాజు తెలిపారు. శనివారం జూటూరు గ్రామ సమీపంలోని జగనన్న కాలనీలో అంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. అధికారులు కూడా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఓ గాయత్రీ, ఏఈ హౌసింగ్ శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రంజిత్‌బాషా ఉన్నారు.

అధిక రక్తపోటును నివారించుకుందాం



వరల్డ్ హైపర్‌టెన్షన్ డే ఫ్లెక్సీతో డాక్టర్లు

కొత్తపల్లి: మంచి పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకుని అధిక రక్తపోటును నివారించుకుందామని మండల ప్రత్యేకాధికారి చింతామణి, జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో వరల్డ్ హైపర్‌టెన్షన్ డేను నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తపల్లి, ఎర్రమఠం, గోకవం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు మహమ్మద్ బేగ్, హకీం రషీద్, జుబేదా బేగం, తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ మేరి పాల్గొన్నారు.

కౌలు కార్డులు తీసుకోవాలి



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి

పాములపాడు: భూమి కౌలుకు తీసుకుని సాగు చేసే ప్రతి రైతు కౌలు కార్డు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయాధికారిణి హేమలత సూచించారు. శనివారం మండలంలోని ఇస్కాల, మిట్టకందాల గ్రామాల సచివాలయాల్లో రైతులకు కౌలు పత్రాలపై అవగాహన కల్పించారు. పంట సాగు హక్కు పత్రంతో భూ యజమానికి ఎటువంటి నష్టం ఉండదన్నారు. కార్డు కాల పరిమితి కేవలం 11 నెలలు మాత్రమే అని వివరించారు. కౌలు కార్డు వల్ల కౌలు రైతులకు ఇన్‌పుట్‌సబ్సిడీ, పంట నష్ట పరిహారం తదితర ప్రయోజనాలు కలుగుతాయన్నారు. వీఆర్వోలు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సువర్ణమ్మ, అధికారులు

జూపాడుబంగ్లా: ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ సువర్ణమ్మ, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపీకృష్ణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రతి ఒక్కరూ వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస రెడ్డి, ఏఈలు బషీర్, నాగేంద్ర, డీటీ నాగన్న పాల్గొన్నారు.

నేలకూలే వరకు పట్టించుకోరా?



నందికొట్కూరు సమీపంలోని ఎన్‌హెచ్ 340సీ హైవే బ్రిడ్జి వద్ద ఓ విద్యుత్ స్తంభం ఈదురుగాలులకు నేలకొరిగి అప్పుడో, ఇప్పుడో కూలే స్థితిలో ఉంది. విద్యుత్ అధికారులు, సిబ్బంది నిత్యం రాకపోకలు సాగించే దారిలోనే స్తంభం ఒకపక్కకు ఒరిగిపోయి ప్రమాదకంగా ఉన్నా పట్టించుకోకపోవడంతో వారి నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోంది. వ్యవసాయ పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభం పొరపాటున నేలకూలితే జరగరాని ప్రమాదం జరిగితే బాధ్యత ఎవ్వరు వహిస్తారనేది ప్రశ్నార్థకం. ప్రాణాపాయ ఘటనలు చోటుచేసుకోకముందే ట్రాన్స్‌కో అధికారులు స్తంభాన్ని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

– జూపాడుబంగ్లా

సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకపోతే ఉద్యమాలు

- మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి



అండర్‌పాస్ వంతెనను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి

పాములపాడు: సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకపోతే ప్రజలతో కలిసి ఉద్యమాలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి నేషనల్ హైవే అధికారులను హెచ్చరించారు. శనివారం మండల కేంద్రం నుంచి కొత్తపల్లి మండలానికి వెళ్లే రహదారిలోని అండర్‌పాస్ వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవే 340సీ నిర్మాణ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారన్నారు. పాములపాడు-కొత్తపల్లి మండలాలకు అనుసంధామైన ఈ రహదారి పట్ల నేషనల్‌హైవే అధికారులు ఎందుకు అంత నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. అండర్‌పాస్ వంతెనతో పాటు సర్వీసు రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పి ఇంత వరకు అతీగతీ లేదని మండిపడ్డారు. ఆయన వెంట కో ఆప్షన్‌సభ్యుడు ముర్తుజాఅలీ, వైఎస్సార్‌సీపీ నాయకులు శేషులు, శేఖర్, ప్రసాద్, విజయ్‌కుమార్, అలి ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ఎమ్మెల్యే జయసూర్య



బొల్లవరం గ్రామంలో ర్యాలీలో ప్రజాప్రతినిధులు, అధికారులు

నందికొట్కూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర ర్యాలీలో టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రం ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే పట్టణంలో మున్సిపల్ కార్యాలయం నుంచి పటేల్ సెంటర్ వరకు స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ కార్యక్రమం కమిషనర్ బేబి నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజల చేత కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రమ్మణ్యం శర్మ, ఈఓఆర్డీ పాల్గొన్నారు.

- పగిడ్యాల: మండల వ్యాప్తంగా శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. నెహ్రూనగర్‌లో నిర్వహించిన ర్యాలీలో మండల ప్రత్యేక అధికారిణి, సెరికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ పరమేశ్వరి పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయం చుట్టూ పేరుకుపోయిన చెత్తచెదారం చూసి పంచాయతీ కార్యదర్శి వీరన్న యాదవ్‌పై మండిపడ్డారు. వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. పాత, కొత్త ముచ్చుమర్రిలో జరిగిన కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఎంఈఓ 2 మురళీమోహన్‌రెడ్డి ఉన్నారు.
- పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటరు వరకు స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటాని అక్కడ ప్రజలతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. బస్టాండ్ సెంటరులో చలి వేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాజు, ఏఓ గాయత్రీ, ఏపీఎం ఉమామహేశ్వరి, ఏపీఓ అలివేలిమంగమ్మ పాల్గొన్నారు.
- జూపాడుబంగ్లా: స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయ పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, రెవెన్యూ సిబ్బంది తొలగించారు. తంగడంచలో సర్పంచ్ ఈశ్వరరెడ్డి, ఏపీఎం అంబమ్మ, మండ్లెంలో సర్పంచ్ కృపమ్మ, ఏఓ కృష్ణారెడ్డి అధ్వర్యంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి పరిసరాలను, గ్రామాలను శుభ్రంగా ఉంచుకుంటామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. డీటీ నాగన్న పాల్గొన్నారు.

- శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో శనివారం ఒకటవ పట్టణ పోలీసులు స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ జి.ప్రసాదరావు ఆధ్వర్యంలో శ్రీశైలం స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు. స్టేషన్ ఆవరణలో పండ్ల మొక్కలు నాటారు.

- బండిఆత్మకూరు: స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రలో భాగంగా బండి ఆత్మకూరు, పార్నపల్లి గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అబ్దుల్ రహిమాన్, ఎంపీడీఓ ఎం.దస్తగిరి, తహసీల్దార్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.
- మహానంది: స్థానిక వ్యవసాయ కళాశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర ప్రోగ్రాంలో భాగంగా బీట్ ద హీట్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. తిమ్మాపురం పీహెచ్‌సీలో డాక్టర్ భగవాన్‌దాస్, డాక్టర్ వేణుకార్తికేయ, ఎంపీహెచ్‌ఈఓ హుసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.
- వెలుగోడు: స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల స్పెషల్ ఆఫీసర్ నాగ మునీశ్వరి ఆధ్వర్యంలో అధికారులు ర్యాలీ, స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నీరు ఎక్కువగా తాగాలని ఆమె సూచించారు. పొట్టి శ్రీరాములు సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, ఏపీఓ నాగజ్యోతి, పంచాయతీ కార్యదర్శి సుంకన్న పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాము నాయక్

నంద్యాల(న్యూటౌన్): స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు సహకారించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ కోరారు. శనివారం డీఆర్‌ఓ ఛాంబర్‌లో ఓటర్ల జాబితా రూపకల్పనపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీ ప్రతినిధులకు అందజేశామని, ఈజాబితాలోని డెత్ ఓటర్లు, చేర్పులు, మార్పులు బూత్ స్థాయి ఏజెంట్లతో పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓలకు తెలియజేయాలని సూచించారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు సూచించిన అంశాలను ఎన్నికల సంఘానికి నివేదిస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ 80 సంవత్సరాలు పైబడిన వారికి హోం ఓటింగ్ ఎలా అవకాశం కలిస్తారో, అదే రీతిలో గర్భిణులకు కూడా కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి సాయిరాం రెడ్డి, బీఎస్పీ నుంచి చంద్రశేఖర్, టీడీపీ తరఫున శివరాం రెడ్డి పాల్గొన్నారు.

24 నుంచి ఉచిత శిక్షణ

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ద్వారా నిరుద్యోగులకు ఈనెల 24 నుంచి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు మూడు నెలలు, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌కు మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, కంప్యూటర్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

మహానంది యూనిట్ అభివృద్ధికి ప్రణాళికలు

మహానంది: మహానందిలోని ఏపీ టూరిజం యూనిట్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తామని ఏపీ టూరిజం శాఖ డీవీఎం లక్ష్మీనారాయణ తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు.

మహానందిలో వర్షం

మహానంది: మహానంది క్షేత్ర పరిధిలో శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆలయ పరిసరాలతో పాటు సమీప గ్రామాల పరిధిలో కొద్దిపాటి వర్షం పడింది. పంట పొలాల్లో పసుపు, పొగాకు, మొక్కజొన్న, ఇతర పంటల దిగుబడులను ఆరబెట్టుకున్న రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి ఉక్కపోతకు గురైన భక్తులు, స్థానికులు సాయంత్రం నుంచి వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆలయ ఆవరణలోని సుపథ మండపాల్లో భక్తులు సేదతీరారు.

సీనియర్ అసిస్టెంట్‌కు పదోన్నతి



పదోన్నతి పొందిన ఎంఎన్‌కే రాజు

మహానంది: స్థానిక దేవస్థానంలో సీనియర్ అసిస్టెంట్ ఎం.నీలకంఠరాజుకు సూపరింటెండెంట్‌గా పదోన్నతి కలిపిస్తూ శనివారం ఈఓ శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తూ శ్రీశైలం వెళ్లి పదవీ విరమణ పొందిన సూపరింటెండెంట్ నాగరాజు స్థానంలో నీలకంఠరాజుకు పదోన్నతి కల్పించి నియమించారు. నీలకంఠరాజును ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు నాగమల్లయ్య, పి.సుబ్బారెడ్డి అభినందించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవు

- ఆర్డీఓ నాగజ్యోతి



మాట్లాడుతున్న ఆర్డీఓ నాగజ్యోతి

ఆత్మకూరు: ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారిపై చర్యలు తప్పవని ఆర్డీఓ నాగజ్యోతి హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆమె తన కార్యాలయంలో పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టంపై ఆయా శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఆత్మకూరు డివిజన్‌లో ఆడపిల్లల సంఖ్య తక్కువగా ఉందన్నారు. పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. చట్టంపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని తెలుసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. లింగ నిర్ధారణ కేంద్రాలపై ఎప్పటికప్పుడు దాడులు చేసి సీజ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్‌డీఎల్ ఏసీ చైర్మన్ కాంతారావు, ఏపీపీ సుస్మిత, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ కుసుమలత

కొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమై 1.45 గంటలకు ముగించేశారు. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదకలు చదివి వినిపించారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ కుసుమలత, జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి అధికారులకు సూచించారు. అనంతరం దేశ రక్షణలో అమరులైన వారికి నివాళులర్పించి, రెండు నిమిసాలు మౌనం పాటించారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి చింతామని, ఎంపీడీవో మేరీ తహసీల్దార్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్లు ప్రారంభించాలి



పొగాకు దిగుబడులను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఆత్మకూరు: పొగాకు కొనుగోళ్లను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్, మండల కార్యదర్శి వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కరివేన గ్రామంలో తడిసిన పొగాకు దిగుబడులను పరిశీలించి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 36 వేల ఎకరాల్లో రైతులు పొగాకు పంట పండించారన్నారు. ఆలయన్స్ వన్, ఎంఎల్, జీపీఐ, ఎంఎల్ తదితర పొగాకు కంపెనీలు రైతుల నుంచి ఒప్పందం చేసుకోవడంతోనే పెద్దఎత్తున రైతులు పొగాకును పండించారన్నారు. దిగుబడులు చేతికొచ్చిన తర్వాత కొనుగోలు చేయకపోవడం కంపెనీలకు తగదన్నారు. ఇప్పటికైనా కొనుగోలు ప్రారంభించి రైతులను ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున కంపెనీ గోదాములను ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): పాఠశాల పునర్విభజన, క్రమబద్ధీకరణకు ప్రభుత్వం విడుదల చేసిన 19, 20, 21 ఉత్తర్వులను వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు కోరారు. శనివారం హోలీక్రాస్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవోలను వ్యతిరేకిస్తూ ఈనెల 21 చేపట్టనున్న ఉమ్మడి జిల్లా విద్యాశాఖ కార్యాలయాల ముట్టడికి, 23న అమరావతిలో జరిగే విద్యాభవన్ ముట్టడికి ఉపాధ్యాయులు తరలిరావాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర కమిటీ సభ్యుడు సాంబశివుడు, రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రావు, నాయకులు ఉమర్, సుంకన్న, శ్రీరాములు, భాస్కర్, ప్రతాపరెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

అధికరక్తపోటు పట్ల అప్రమత్తంగా ఉండాలి

జూపాడుబంగ్లా: అధిక రక్త పోటు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పారుమంచాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు యశశ్విని తెలిపారు. శనివారం ప్రపంచ ×హైపర్‌టెన్షన్‌డే×(అధికరక్తపోటు) దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో వైద్యసిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తినే ఆహారంలో ఉప్పు, కారంతోపాటు కొవ్వు, మసాలాలు, నూనెపదార్థాలను తగ్గించుకోవాలన్నారు. ఉదయం, సాయంత్రం కొంత సమయం వ్యాయామానికి కేటాయించాలన్నారు. అధిక ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకుగాను కొబ్బరి నీళ్లు, మజ్జిగ తాగాలని సూచించారు. పరిసరాల్లో చెత్తాచెదారం, మురుగునీటి నిల్వ లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ గుట్టలయ్య పాల్గొన్నారు.

శానిటైజేషన్ ఇన్‌స్పెక్టర్ పోస్టు భర్తీ చేయాలి

నందికొట్కూరు: పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో ఖాళీగా ఉన్న శానిటైజేషన్ ఇన్‌స్పెక్టర్ పోస్టును భర్తీ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి కోరారు. శనివారం కార్యాలయంలో కమిషనర్ బేబి, చైర్మన్ దాశి సుధాకరరెడ్డిలను కలిసి వినతి పత్రాలు అందజేశారు.

ఆకట్టుకున్న ప్రవచనం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై వీరభద్ర విజయంపై ఒంగోలుకు చెందిన పొన్నూరు వెంకట శ్రీనివాసులు ప్రవచన కార్యక్రమం ఆకట్టుకుంది.

1,100 లీటర్ల నాటుసారా ధ్వంసం



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

ఆత్మకూరు: మండలంలోని సిద్దాపురం గ్రామ సమీపంలో భవనాశి వంక వద్ద నాటుసారా స్థావరంపై దాడులు చేసి 1,100 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్ శనివారం తెలిపారు. నాటుసారాకు ఉపయోగించే డ్రమ్ములు, సామగ్రిని స్వాధీనం చేసి, నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో నందికొట్కూరు ఎక్సైజ్ సీఐ రామాంజులనాయక్, ఈఎస్‌టీఎఫ్ నంద్యాల టీం, ఫారెస్ట్ స్రైటింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.